క్రీడామైదానం కల నెరవేరేనా!

- పారిశ్రామిక ప్రాంతంలో క్రీడాకారుల ఇబ్బందులు
- ఏళ్ల తరబడి ప్రతిపాదనలకే పరిమితం


గుంతలు ఏర్పడిన మైదానంలో ఆడుతున్న యువత

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు ఉన్నారు. అయితే వారు ఆడుకోవడానికి సరైన క్రీడామైదానం మాత్రం లేదు. దీంతో క్రీడాకారులు వివిధ ఆటల్లో శిక్షణ, ప్రాక్టీస్ కోసం నగరంలో ఉన్న క్రీడామైదానాలకు వెళ్తున్నారు. మరికొంత మంది జింక్ మైదానం ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

ఏడు వార్డులు.. లక్ష జనాభా..

పారిశ్రామిక ప్రాంతంలో ఏడు వార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో సుమారు లక్షకు పైగా జనం ఉన్నారు. సుమారు 2 వేల మంది వరకు క్రికెట్,బ్యాడ్మింటన్, బాక్సింగ్, కరాటే వంటి క్రీడలు ఆడుతుంటారు. అయితే వీరు ఆయా క్రీడల్లో మంచి శిక్షణ పొందేందుకు అనువైన క్రీడామైదానం లేదు.

వాకింగ్ పార్కే దిక్కు

జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెంలో పదేళ్ల కిందట అప్పటి జీవీఎంసీ కమిషనర్ వాకింగ్ అండ్ సైక్లింగ్ పార్కు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ పార్కులోనే బాక్సింగ్, కరాటేలో శిక్షణ పొందుతున్నారు. ఇక క్రికెట్,బ్యాడ్మింటన్,రన్నింగ్,వాలీబాల్, ఫుట్‌బాల్‌లో ప్రాక్టీస్ చేయా లంటే నగరంలోని పీఎంపాలెం స్టేడియం వద్దకు లేదా, జింక్ మైదానానికి వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ఇక్కడ క్రీడాకారుల విజ్ఞప్తి మేరకు హెచ్‌పీసీఎల్ యాజమాన్యం క్రీడామైదానం పారిశ్రామిక ప్రాంతంలో నిర్మించేందుకు ముందుకు వచ్చింది.అయితే కొంత మంది రాజకీయనాయకుల స్వార్థం కారణంగా నిధులు దారిమళ్లిపోయాయి. దీంతో పారిశ్రామిక ప్రాంతంలో క్రీడామైదానం నిర్మాణం కలగానే మిగిలిపోయింది.

వినతులు ఇచ్చినా..

జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం నుంచి ప్రకాష్‌నగర్ వెళ్లే మార్గంలో విశాలమైన స్థలం ఉంది. దానిలోనైనా క్రీడామైదానం నిర్మించాలని స్థానిక యువత అధికారులకు పలు మార్లు వినతులు ఇచ్చారు.పలు పార్టీల నాయకులు హామీలు కూడా ఇచ్చారు. అయినా మైదానం ఏర్పాటు కార్యరూపం దాల్చలేదు.

పిల్లలు ఇబ్బంది పడుతున్నారు



మా ప్రాంతంలో సరైన క్రీడామైదానం లేదు. దీంతో పలు క్రీడల్లో శిక్షణ కోసం చిన్నారులు, యువత మధురవాడ, జింక్ వద్ద క్రీడామైదానాలకు వెళ్లాల్సి వస్తోంది. ఏడు వార్డుల పరిధిలో ప్రభుత్వ స్థలం ఉంది. దానిలో వసతులతో కూడిన క్రీడామైదానం నిర్మిస్తే మంచిది. – శీర చిన్నాజీ, మల్కాపురం

జింక్ మైదానానికి తీసుకెళ్తున్నా..



పారిశ్రామిక ప్రాంతంలో సరైన క్రీడామైదానం లేకపోవడంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. మా పిల్లలను జింక్ మైదానికి తీసుకువెళుతున్నాం. అవకాశం లేని వారు క్రీడలకు దూరం అవుతున్నారు. అధికారులు స్పందించి పారిశ్రామిక ప్రాంతంలో మైదానం నిర్మించాలి. – బాలు, హరిజనవీధి

నిర్మాణానికి చర్యలు

పారిశ్రామిక ప్రాంత క్రీడాకారుల కోసం వసతులతో కూడిన మైదానం నిర్మాణం కోసం స్థల పరిశీలన చేస్తాం. అనుకూలమైన, క్రీడకారులకు అందుబాటులో ఉండే స్థలం లభించిన వెంటనే క్రీడామైదానం నిర్మిస్తాం.
– కృష్ణ, జోన్–5 జెడీ్స

క్లుప్తంగా

విద్యుత్ శాఖ అధికారుల తక్షణ స్పందన


విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వెలగని లైట్లు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంగళవారం సాయంత్రం సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని పలు నివాసాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకుంది. స్థానికులు విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో తక్షణ వారు స్పందించి మరమ్మతులు చేపట్టి,విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

10న ఆలయ పునఃప్రారంభం


ఉత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

కంచరపాలెం: స్థానిక గొల్ల కంచరపాలెంలోని కోదండ సీతారామ ఆలయాన్ని ఈ నెల 10న పునఃప్రారంభిస్తున్నట్లు గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ తెలిపారు. దీంతో పాటు నూతనంగా నిర్మించిన సంపత్ వేంకటేశ్వర స్వామి, ధనలక్ష్మి దేవి ఆలయాలను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. శ్రీరామా సేవా సమాజం ఆవరణలో మంగళవారం మహోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు శ్రీమాన్ రేజేటి శ్రీరామాచార్యులు సంపూర్ణ పర్యవేక్షణలో జరగనున్నాయని వెల్లడించారు.

హోలీ వేడుక


రంగులు రాసుకుంటున్న కార్మికులు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో నివాసం ఉంటున్న నార్త్ ఇండియన్స్ హోలీ వేడుకలను మంగళవారం సందడిగా నిర్వహించారు. హెచ్‌పీసీఎల్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతో పాటు మల్కాపురం,శ్రీహరిపురం,ఆర్కేపురం తదితర ప్రాంతాలలో ఒకరిపై ఒకరు రంగులు పూసుకుని ఎంజాయ్ చేశారు.

గ్యాస్ ధర తగ్గించాలని నిరసన


గ్యాస్ సిలిండర్‌తో నిరసన తెలుపుతున్న మహిళలు

సింధియా: పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ 63వ వార్డు కాకరలోవ జంక్షన్‌లో మహిళా సమైక్య ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ప్రభుత్వం తక్షణమే పెంచిన గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని, లేనిపక్షంలో మహిళా సంఘాలన్నీ ఏకమై ఉద్యమబాట పడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు గుడాల జయ, పందిరి జయలక్ష్మి, రమ, పద్మ, తులసీ, రోజా తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి పన్ను చెల్లించని వాహన తనిఖీలు

గోపాలపట్నం: జిల్లా వ్యాప్తంగా పన్నులు చెల్లించని వాహనాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని ఉప రవాణా కమిషనర్ రాజారత్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే ఫోన్ల ద్వారా వాహన యజమానులకు సమాచారమిచ్చామని, ఈ నెల 11లోగా పన్నులు చెల్లించాలన్నారు. ఈనెల 13 నుంచి తనిఖీలు చేపడతామన్నారు. స్క్రాప్ అయిన వాహనాలకు వెంటనే పన్ను చెల్లించి రిజిస్ట్రేషన్ రద్దు చేసుకోవాలని సూచించారు.

దమ్మున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి

- పట్టభద్రుల ఎన్నికల్లో సీతంరాజుకు మద్దతివ్వండి
- రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి
- ఘనంగా శిష్టకరణాల సంఘీభావ సభ


వైవీ సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న శిష్టకరణాల సంఘ సభ్యులు


కార్యక్రమంలో పాల్గొన్న శిష్టకరణాల సంఘ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు

గోపాలపట్నం: దమ్మున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి.. అన్ని వర్గాల అభ్యున్నతే ఆయన లక్ష్యం అని రాజ్య సభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. గోపాలపట్నం కుమారి కల్యాణ మండపంలో మంగళవారం జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అధ్యక్షతన శిష్టకరణాల సంఘీభావ సభ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతూ శిష్ట కరణాలు నాడు రాజులకు పాఠాలు చెప్పేవారు. ప్రజలకు మేలు చేసే శాసనాలు తయారు చేసే వారిగా కీర్తి గడించారని అన్నారు. అలాంటి సామాజిక వర్గంలో వెనుకబడిన వారే ఎక్కువ మంది ఉన్నారన్నారు. దాన్ని పరిగణలోకి తీసుకుని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి శిష్టకరణాలను బీసీల్లో చేర్పించారని తెలిపారు. ఆ బాధ్యత అప్పట్లో వైఎస్సార్ తనకే అప్పగించారని కృష్ణయ్య పేర్కొన్నారు. ఇప్పుడు ఆయన తనయుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా బలోపేతం కావడానికి నిస్వార్థంగా పని చేస్తున్నారని తెలిపారు. శిష్టకరణాలను ఓబీసీ కేటగిరిలో చేర్పించేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ అంశం కేంద్ర ప్రభుత్వంలో ఉందని.. దీని కోసం ఛలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిద్దామన్నారు.

విజనరీ లీడర్ సీఎం జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన కార్యక్రమాల ఫలితాలు 15 ఏళ్ల తర్వాత ప్రపంచ పటంలో ఆంధ్రప్రదేశ్‌ను అత్యున్నత స్థానంలో నిలబెడతాయని తెలిపారు. ఇంత విజన్ ఉన్న నాయకుడు బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి అయిన సీతం రాజు సుధాకర్‌కు మద్దతివ్వాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ పట్టభద్రులంతా సీతం రాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించుకోవాలని కోరారు. శిష్టకరణాల సమస్యలను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇప్పటికే బీసీ కమిషన్ 23 కులాలను ఓబీసీ కేటగిరిలో చేర్పించాలని సిఫార్సు చేసిందని.. అందులో శిష్టకరణాలు ఉన్నారని పేర్కొన్నారు. దీనిపై ఢిల్లీలో పోరాటం చేసే బాధ్యత కూడా మనమే తీసుకుందామని తెలిపారు. ఉత్తరాంధ్రను పరిపాలనా రాజధాని చేసేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రికి పట్టభద్రుల ఎమ్మెల్సీగా సీతంరాజు సుధాకర్‌ను గెలిపించి కానుకగా ఇవ్వాలని కోరారు. బ్యాలెట్‌లో వరుస సంఖ్య 3లో ఉన్న సీతంరాజు సుధాకర్ పేరు ఎదురు గడిలో 1వ నంబర్ వేయాలని కోరారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డితో పాటు ఆర్. కృష్ణయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శిష్టకరణాల కార్పొరేషన్ చైర్‌పర్సన్ అనుషా పట్నాయక్, బీసీ కార్పొరేషన్ సభ్యుడు పక్కి దివాకర్, శిష్టకరణాల సంఘం జాతీయ అధ్యక్షుడు డీవీ కృష్ణారావు, రాష్ట్ర అధ్యక్షుడు పోలు మహంతి ఉమామహేశ్వరరావు, నాయకులు డబ్బీరు వెంకటరావు, బీఆర్ఎం పాత్రో, బి. హరి బాబు, డి. చంద్రమౌళి, కుప్పిలి గణేష్, వైటపల్లి గోవిందు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సందడిగా మహిళా దినోత్సవం


మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆడారి ఆనంద్ కుమార్, ఎస్‌ఏ రెహ్మాన్ తదితరులు

- అలరించిన మహిళల నృత్యవిన్యాసాలు
- పాల్గొన్న ఆడారి ఆనంద్, ఎస్‌ఏ రెహ్మాన్

గోపాలపట్నం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడాలేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 14 వార్డుల మహిళలతో కార్యాలయం కళకళలాడింది. పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్, నియోజకవర్గ పరిశీలకుడు ఎస్‌ఏ రెహ్మాన్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మహిళలకు పెద్ద పీట వేశారని తెలిపారు. ఈ సందర్భంగా మహిళలకు, చిన్నారులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం మహిళా విభాగం రీజినల్ కోఆర్డినేటర్ గరికిన గౌరి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు అద్దాల కృపాజ్యోతి, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షురాలు బయ్యవరపు రాధను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మహిళా కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

వ్యర్థాలు తొలగించరూ!


పిలకవానిపాలెం గెడ్డలో పేరుకుపోయిన వ్యర్థాలు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెం శివారు ప్రాంతంలోని గెడ్డలో నెల రోజుల నుంచి వ్యర్థాలు పేరుకుపోయి ఉన్నాయి. దీంతో దుర్వాస రావడంతో పాటు క్రిముల చేరి చాలా ఇబ్బందికరంగా ఉంది. అధికారులు స్పందించి వ్యర్థాలు తొలగించాలి.
– బుజ్జి, పిలకవానిపాలెం

మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి


ప్రజలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ గల్లా చిన్నా

సింధియా: జీవీఎంసీ 63వ వార్డులోని పలు ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ గల్లా చిన్నా బుధవారం జీవీఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. మంచినీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వార్డులో మంచినీటి సమస్యలు, డ్రైనేజీ సమస్యలు ఎదుర్కొంటున్నామని ప్రజలు కార్పొరేటర్ దృష్టికి సమస్యలను తీసుకువెళ్లారు. నీటి సరఫరాలో హెచ్చుతగ్గులు లేకుండా సరఫరా చేయాలని, పాడైపోయిన పైప్‌లైన్ల స్థానంలో కొత్తవి అమర్చాలని అధికారులను ఆదేశించారు. గల్లా చిన్నా మాట్లాడుతూ వార్డును అభివృద్ధిపథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. నాయకులు పుక్కల కృష్ణ, పుక్కల రాజారావు, ధర్మ, బాబూరావు, రమేష్, రాజా పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి


బండారు శ్రీనివాస్

గోపాలపట్నం: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంప్లాయిస్ అసోసియేషన్ ఏపీ సంయుక్త కార్యదర్శిగా బండారు శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల నగరంలో నిర్వహిచంచిన సర్వసభ్య సమావేశంలో శ్రీనివాసరావు సంయుక్త కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈయన జీవీఎంసీ 92వ వార్డు గోపాలపట్నం సచివాలయంలో శానిటరీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఉద్యోగుల భద్రతకు సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

52వ వార్డులో ముమ్మర ప్రచారం


పట్ట భద్రులకు నమూనా బ్యాలెట్ అందిస్తున్న జియ్యాని శ్రీధర్ తదితరులు

గోపాలపట్నం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. జీవీఎంసీ 52వ వార్డులో వైఎస్సార్ సీపీ నేతలు పట్ట భద్రులను కలిసి వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతున్నారు. శాంతినగర్‌లో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఓటర్ల ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యురాలు శ్రీదేవి వర్మ, ఎన్నికల పరిశీలకుడు సూర్యనారాయణ, వెదుళ్ల శ్రీనివాసరావు, దేవి, అనురాధ, పద్మ పాల్గొన్నారు.

కిరండూల్ లైన్‌లో పలు రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): భద్రతా కారణాల వలన కిరండూల్‌లో లైన్‌లో నడిచే పలు రైళ్లు ఆయా తేదీలలో గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. కిరండూల్‌లో బుధవారం బయల్దేరవలసిన కిరండూల్–విశాఖపట్నం (18513) నైట్ ఎక్స్‌ప్రెస్ కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుండి బయల్దేరి విశాఖ చేరుకుంటుంది. విశాఖ బుధవారం బయల్దేరే విశాఖ- కిరండూల్ (08551) దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. కిరండూల్‌లో బుధ, గురువారాల్లో బయల్దేరవలసిన కిరండూల్ - విశాఖ రైలు ఆయా తేదీలలో కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖ చేరుకుంటాయి.

మహిళా పోలీసులకు వైద్య పరీక్షలు

- ఉమెన్స్ డే సందర్భంగా ఉచిత వైద్య శిబిరం


పోలీస్ అధికారులు, సిబ్బందికి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

దొండపర్తి: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విశాఖ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పోలీస్ బ్యారెక్స్ వద్ద ఉన్న పోలీస్ కల్యాణమండపంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ సతీమణి విజయలక్ష్మి, డీసీపీ-1 సతీమణి కె.అనీషాగరుడ్, డీసీపీ-2 సతీమణి కె.లతారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే రీజనల్ పోలీస్ హాస్పిటల్ యూనిట్ మెడికల్ ఆఫీసర్ పి.పద్మజ, మహాత్మా గాంధీ క్యాన్సర్ ఆస్పత్రి డాక్టర్ డాక్టర్.సుభద్ర, అక్షయ హాస్పిటల్ డాక్టర్ గీతా శ్రీకాంత్, మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది వారి కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

మేడ పైనుంచి పడి విద్యార్థిని మృతి

అల్లిపురం: ప్రమాదవశాత్తు అపార్ట్‌మెంట్ మొదటి అంతస్తు పైనుంచి పడి ఓ ఇంటర్ విద్యార్థిని మృతి చెందిన ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి లో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. అస్సాంగార్డెన్స్‌లో పోలీస్ క్వార్టర్స్ సమీప ఓ అపార్ట్‌మెంట్‌లో దొడ్డి తనుశ్రీ(17) తన కుటుంబంతో నివసిస్తోంది. సోమవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో స్నానం చేసేందుకు వెళ్తున్న ఆమె.. బాల్కనీలో ఆరబెట్టిన టవల్ తీసుకునేందుకు వంగి ప్రమాదవసాత్తు జారి కింద పడిపోయింది. కుటుంబ సభ్యులు సెవెన్‌హిల్స్ ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మృతి చెందింది.

అందరి భాగస్వామ్యంతో స్వచ్ఛత


మర్రిపాలెం రైతుబజారులో మాట్లాడుతున్న ఏఎంహెచ్‌వో రాజేష్, పక్కన జెడీ్స కృష్ణ

గోపాలపట్నం: అందరి భాగస్వామ్యంతోనే స్వచ్ఛత సాకారమవుతుందని జెడీ్స ఆర్‌జీవీ కృష్ణ, ఏఎంహెచ్‌వో రాజేష్ అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం రైతు బజారులో పారిశుద్ధ్యంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జెడీ్స ఆర్‌జీవీ కృష్ణ మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వాహణలో జీవీఎంసీకి యంత్రాంగానికి ప్రజలు సహకరించాలని కోరారు. తడి పొడి ప్రమాదకర చెత్త వేర్వేరుగా అందివ్వాలని కోరారు. ఏఎంహెచ్‌వో రాజేష్ మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచుల వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. వ్యర్థాలను కాల్వలు.. గెడ్డల్లో వేయవద్దని తెలిపారు. దోమల కాటు బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారానికి ఒక రోజు డ్రైడే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ ఎస్. జనార్దన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ జీవీఎస్ మూర్తి, రైతు బజారు ఎస్టేట్ అధికారి వరహాలు, సహాయకుడు ప్రతాప్ పాల్గొన్నారు.

వైభవంగా పైడిమాంబ జాతర


అమ్మవారిని దర్శించుకుంటున్న ఆడారి ఆనంద్‌కుమార్

కంచరపాలెం: కంచరపాలెం వాసుల ఆరాధ్య దేవత పైడిమాంబ అమ్మవారి జాతర మంగళవారం వైభవంగా జరిగింది. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సుమారు 350 ఘటాలను మూలవిరాట్ నుంచి అమ్మవారి ఆలయానికి తీసుకొచ్చారు. కోలాటాలు, తప్పెటగుళ్లు, నేలవేషాలు నడుమ అమ్మవారి ప్రతిమలను ఊరేగించారు. అనంతరం ప్రధాన ఆలయం వద్దకు తీసుకొచ్చి ఘనంగా అనుపోత్సవం నిర్వహించారు.

'వేదిక'పై వేడుక

- మూడు రోజుల్లో 400 ప్రదర్శనలు
- జీ–20 సదస్సు జరిగే వరకు వీకెండ్‌లో మాత్రమే ప్రదర్శన



పాట పాడుతున్న దివ్యాంగుడు




డ్యాన్స్‌చేస్తున్న బాలిక

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): నగరవాసులు తమ ప్రతిభను చాటుకునేందుకు జీవీఎంసీ ఆధ్వర్యంలో 'వేదిక' ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఆర్కే బీచ్ వేదికగా తమ టాలెంట్‌ను ప్రదర్శించే అవకాశం కల్పించింది. జీ–20 సదస్సు నేపథ్యంలో వినూత్నంగా ఈ కార్యక్రమాన్ని జీవీఎంసీ చేపట్టింది. మూడు రోజులుగా జరిగిన వైజాగ్ టాలెంట్ హంట్‌కు విశేష స్పందన లభించింది. 400లకుపైగా ప్రదర్శనలు జరిగాయి. ముగింపు రోజైన మంగళవారం దివ్యాంగులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఫ్లూట్, గిటార్ వంటి వాయిద్యాలు, పాటలు పాడుతూ ప్రతిభ చాటుకున్నారు. ఇకపై ప్రతీ శని, ఆదివారాల్లో వేదిక జీ–20 సదస్సు జరిగే వరకు ప్రతీ శని, ఆదివారాల్లో ఈ కార్యక్రమం ఆర్కేబీచ్ వద్ద నిర్వహించనున్నట్టు జీవీఎంసీ అదనపు కమిషనర్ సన్యాసినాయుడు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తమ పేర్లను నమోదు చేసుకొని ప్రదర్శన ఇవ్వవచ్చన్నారు.

గాయని సుశీలకు స్వాగతం


సుశీలకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

మద్దిలపాలెం (విశాఖ తూర్పు): మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం కళాభారతో నిర్వహించనున్న కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గాయని సుశీల హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఆమె విశాఖ చేరుకున్నారు. విశాఖ ఎయిర్‌పోర్టులో సుశీలకు యాక్మీ ప్రతినిధి ప్రతాప్, వండర్ కిడ్స్ స్కూల్ అధినేతలు రాముడు నాయుడు దంపతులు స్వాగతం పలికారు.

ఉపాధ్యాయులకు వృత్తి నైపుణ్య శిక్షణ

విశాఖ విద్య: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న సబ్జెక్టు టీచర్లకు లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(లిప్)లో భాగంగా వృత్తి నైపుణ్య శిక్షణ ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్ని స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో శిక్షణ నిర్వహించారు. మంగళవారం సైన్స్, హిందీ సబ్జెక్టుల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. వృత్తి నైపుణ్య శిక్షణ ఉపాధ్యాయులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సమగ్ర శిక్ష అభియాన్ ఏఎంవో ఎ. శ్రీనివాసరావు తెలిపారు.